క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు


ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాశ్వత ఉభయకర్తల గోత్ర నామాలతో పూజలు, సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారి పల్లకి సేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

మహాసభలకు ఎంపీకి ఆహ్వానం



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో అఖిల భారత తపాలా ఉద్యోగ సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా గురువారం కలిశారు. నగరంలోని ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్ – సీ, జెడీఎస్ ద్వైవార్షిక మహాసభలకు ఎంపీని ఆహ్వానించారు. జీడీఎస్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పెంచలయ్య, ఏఐపీఈయూ గ్రూప్ – సీ డివిజన్ అధ్యక్షుడు హరి, నెల్లూరు డివిజన్ ఏఐపీఈయూ పోస్ట్‌మెన్, ఎంటీఎస్ యూనియన్ ప్రెసిడెంట్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సత్యనారాయణ స్వామి వ్రతం

నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణ మాస పౌర్ణమిని పురస్కరించుకొని స ంతపేటలోని బ్రాహ్మణవీధిలో గల వ్యాసరాజ మఠ ం ప్రాంగణంలో కొలువైన సత్యనారాయణస్వామికి విశేష పూజలను భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహి ంచారు. స్వామివారికి సు ప్రభాతసేవ, గణపతి పూ జ, నవగ్రహ పూజ, పంచామృతాభిషేకాలను మందిర ప్రధానార్చకుడు వేదవ్యాస్ ఆధ్వర్యంలో జరిపారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతాన్ని వేడుకగా నిర్వహించారు.

• గురురాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని మఠంలో కొలువైన రాఘవేంద్రస్వామికి పంచామృతాభిషేకం, సర్వసేవను నిర్వహి ంచారు. ఉభయకర్తలుగా అర్వపల్లి సుజాత, సుబ్బారావు దంపతులు వ్యవహరించారు. సింహపురి మధ్వ సంఘ అధ్యక్షుడు దేవరసు ప్రవీణ్, మఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు పర్యవేక్షించారు.

• వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మందిర ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా విజయకుమార్‌రెడ్డి, వాణి మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, సుబ్బరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు మాలకొండయ్య, సలహాదారు లక్ష్మీనరసింహయాదవ్, రామ్మూర్తి పర్యవేక్షించారు.

కల్యాణ వెంకటేశ్వరుడి నగరోత్సవం

నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణ పూర్ణిమను పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో కల్యాణ వెంకటేశ్వరస్వామికి నగరోత్సవాన్ని వేడుకగా గురువారం నిర్వహించారు. తొలుత మందిరంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి పూజలు చేశారు. ఉభయకర్తలుగా కృష్ణగిరి దేశ్‌పాల్ సింగ్, దేవకిదేవి దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లు గుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూర్ణిమ



నెల్లూరు(బృందావనం): నిజ శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిరం, అష్టలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి, హయగ్రీవ జయంతిని భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. లక్ష్మీహయగ్రీవ, అష్టలక్ష్మి, రుద్ర హోమాలు, కృష్ణుడికి పుష్పాభిషేకం, తదితరాలను జరిపారు. ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్,పాల్గొన్నారు.

ఉద్యమంలా కొత్త పింఛన్ల మంజూరు

రాష్ట్రంలో సామాజిక పింఛన్లు ఠంఛన్‌గా లబ్ధిదారులకు చేరుతోంది. అదే విధంగా కొత్తవారికి సైతం పింఛన్ల మంజూరు ఉద్యమంలా సాగుతోంది. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా అవినీతికి ఆస్కారం లేకుండా, అర్హతే ప్రామాణికంగా పాలన సాగుతుండడంతో ఎప్పటికప్పుడు కొత్త వారిని గుర్తించి పింఛన్లను అందిస్తున్నారు. దీంతో సెప్టెంబర్ మాసం నుంచి కోవూరు నియోజకవర్గంలో 858 మందికి కొత్త పింఛన్లు పంపిణీ చేయనున్నారు.

• కోవూరు నియోజకవర్గంలో నూతనంగా 858 మందికి పింఛన్లు
• నేటి నుంచి పంపిణీ


ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఇంటికెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: గతంలో పింఛన్ తీసుకునే వారిలో ఎవరైనా మృతి చెందితేనే మరొకరికి మంజూరవుతుంది. అయితే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు పింఛన్ వెతుక్కుంటూ వస్తుంది. అంతే కాదు గత ప్రభుత్వ హయంలో సామాజికి పింఛన్లు తీసుకోవాలంటే మండల కేంద్రానికి పరుగు, పరుగున చేరుకోవాలి. అయినా వెంటనే అందుతుందా.. అంటే అది కూడా జరగదు. పింఛన్ ఇచ్చే అధికారి బ్యాంకుకు వెళ్లి నగదు తీసుకొచ్చి ఇవ్వాల్సిన పరిస్థితి. ఇందుకు ఒక్కోసారి సాయంత్రం కూడా అవుతుంది. ఇలాంటి సమయాల్లో పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు, వికలాంగులు మండుటెండలో అవస్థలు పడుతూ పడిగాపులు కాయడంతో పాటు ఆకలితో అవస్థలు పడేవారు. కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వలంటీర్లు లబ్ధిదారుల తలుపు తట్టి మరీ నగదు అందిస్తున్నారు.

మండలం	కొత్తగా మంజూరైన ఫించన్లు
బుచ్చిరెడ్డిపాళెం అర్బన్	122
బుచ్చిరెడ్డిపాళెం రూరల్	100
విడవలూరు	115
కొడవలూరు	146
ఇందుకూరుపేట	166
కోవూరు	209

మాట తప్పకుండా..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాట తప్పకుండా పింఛన్ నగదును పెంచుకుంటూ పోతున్నారు. గత ఎన్నికల సమయంలో రూ.2 వేల నుంచి రూ.3 వేలు పెంచుకుంటూ పోతామని చెప్పిన మాట ప్రకారంగా ఇప్పటికే ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మూడు దఫాలుగా పెంచారు. గత ప్రభుత్వంలో రూ.2 వేలు ఇస్తుంటే ప్రస్తుతం రూ.2,750 ఇస్తున్నారు. దీనిని వచ్చే సంవత్సరం జనవరి నుంచి రూ.3 వేలుగా పెంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు.


గత ప్రభుత్వ హయాంలో ఫించన్ కోసం ఎండలో పడిగాపులు కాస్తున్న వృద్ధులు (ఫైల్)

దాదాపు 37,023 మందికి..

కోవూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు వృద్ధులు, వికలాంగులు, వితంతు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు కలిపి దాదాపు 36,165 మందికి పింఛన్లు అందజేస్తున్నారు. తాజాగా నియోజకవర్గ స్థాయిలో 858 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి నేటి నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. కొత్తవారితో కలిపి 37,023 మంది నియోజకవర్గంలో పింఛన్లు పొందుతున్నారు.

ప్రతి ఇంటా సంతోషం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా ప్రజలు సంతోషంగా ఉన్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మైపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అందిస్తుండడం వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతోందని చెప్పారు. ఏ ఇంటికి వెళ్లినా సంక్షేమ పథకాల ద్వారా మాకు ఇంత లబ్ధి చేకూరిందంటూ వారు ఆనందంతో చెబుతుంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. అన్నివర్గాలకు మేలు జరగాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఎన్నికల సమయంలో చెప్పిన పథకాలే కాకుండా అదనంగా పథకాలను ప్రవేశపెట్టి అందరికీ న్యాయం చేశారన్నారు. ప్రజలకు రూ.2 లక్షల కోట్లకు పైగా నగదును నేరుగా అందించిన ఘనత భారతదేశంలోనే ఎక్కడా లేదన్నారు. ఎన్నికలొస్తే మరలా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలంతా ఎదురు చూస్తున్నారని చెప్పారు. అనంతరం ఇందుకూరుపేట మండల సమాఖ్య ద్వారా ముగ్గురు గృహ లబ్ధిదారులకు రూ.50 వేల వంతున మంజూరైన రూ.1.50 లక్షలు, పొదుపు మహిళకు మంజూరైన రూ.50 వేల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్ర బాబు, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై వీరేంద్రబాబు, డీటీ బషీర్, సర్పంచ్ సంగం వెంకయ్య, ఎంపీటీసీ సభ్యులు గంపల జయంతి, కూనంగారి రమణయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీహరికోట ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ పామంజి నరసింహ, శివాలయ చైర్మన్ కనుపూరు సురేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి బాలాలయ ప్రతిష్ఠోత్సవాలు


కోదండరాముని ఆలయం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని పెద్దూరులో కొలువైన సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఈనెల 4వ తేదీ వరకు బాలాలయ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు ఆలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. టీటీడీకి చెందిన వైఖానస ఆగమ పండితుడు శ్రీమాన్ పరంకుశం సీతారామాచార్యులు, వారి బృందంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని తెలిపారు. 4న విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మహోత్సవాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు.


మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించిన అర్చకులు, సిబ్బంది

సంగమేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో సంగమేశ్వరుడు

మనుబోలు : శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని బద్దెవోలు క్రాస్ రోడ్డు సమీపంలో కండలేరు ఒడ్డున వెలసిన శ్రీకామక్షిదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు ఫణీంద్రశర్మ స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం చేశారు.

ఘనంగా రక్షాబంధన్


ముదిగేడులో తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి

పొదలకూరు : మండలంలో రక్షాబంధన్ వేడుకలను గురువారం నిర్వహించారు. సోదరులకు అక్కా, చెల్లెళ్లు ఆప్యాయతతో రాఖీ కట్టారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న అక్కచెల్లెళ్లు సైతం తమ అన్నదమ్ముల వద్దకు వచ్చిన రాఖీ కట్టి వారి ఆశీర్వాదం పొందారు.

విద్యార్థుల వివరాలను నమోదు చేయాలి

• ఎంపీడీఓ నగేష్‌కుమారి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పొదలకూరు : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జీఈఆర్(గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో)కు సంబంధించి ప్రతి విద్యార్థి వివరాలు చైల్డ్‌ఇన్ఫో యాప్‌లో నమోదు కావాల్సి ఉంటుందని ఎంపీడీఓ టి.నగేష్ కుమారి పేర్కొన్నారు. పట్టణంలోని అమరావతి స్కూల్‌ను గురువారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పాఠశాల యాజమాన్యం విద్యార్థుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకుని హాజరు పట్టీని పరిశీలించారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న వాసుదేవరావు మాదిగ

పొదలకూరు : ఎస్సీల వర్గీకరణ లక్ష్యంలో భాగంగా హైదరాబాద్‌లో తలపెట్టిన విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదిగల ఆకాంక్షను నెరవేర్చుకోవాల్సిందిగా పిలుపునిచ్చారు. ప్రతిపల్లెలో గ్రామ కమిటీ నిర్మాణం జరగాల్సిందిగా సూచించారు. అనంతరం మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా మురళీమాదిగ, కో–కన్వీనర్‌గా నేలటూరు అనిల్‌మాదిగ, ఎంఎస్పీ మండల కన్వీనర్‌గా తాళ్లపాక ఏడుకొండలు మాదిగ, కో–కన్వీనర్‌గా చిడదల పెంచలయ్య మాదిగలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సూరిపాక ఉదయ్‌కృష్ణమాదిగ, వెంకటయ్యమాదిగ, పిల్లిపాక పండయ్యమాదిగ పాల్గొన్నారు.

లేగదూడలను సంరక్షించుకోవాలి

• ఉపసంచాలకుడు డాక్టర్ సోమయ్య

ముత్తుకూరు : లేగదూడలను సంరక్షించుకుని మేలుజాతి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ సోమయ్య రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కృష్ణపట్నం గ్రామంలో అదానీ–బైఫ్ సంస్థల సహకారంతో గురువారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. నెల్లూరు ఉపసంచాలకులు డాక్టర్ నాగమణిలో కలిసి ఆయన ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1962 నంబర్‌కు ఫోన్ చేసి పశువుల అంబులెన్సు సేవలు పొందాలని సూచించారు. చూడు పశుపోషణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పశువులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరు సహాయ సంచాలకులు డాక్టర్ నిర్మల, వల్లూరు పశువైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మందులను పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారులు

ఆకట్టుకున్న జీ – 20 మాక్ సదస్సు


జీ-20 నమూనా సదస్సులో విద్యార్థులు

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌లో విద్యార్థినీ, విద్యార్థులు గురువారం నిర్వహించిన జీ – 20 మాక్ సదస్సు ఎంతగానో ఆకట్టుకొంది. ఢిల్లీలో ఈ నెల 8,9 తేదీల్లో జీ 20 సదస్సు జరుగనుంది. ఈ సదస్సును విద్యార్థులు నమూనాగా నిర్వహించారు. జీ–20 లోని సభ్యదేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులుగా విద్యార్థులు ఆయా దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్లస్ హెచ్‌ఎం డి.ఓబులేసు మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల వల్ల విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందడంతో పాటు వేదికలపై మాట్లాడే సమయంలో భయం పోతుందన్నారు. అంతేకాకుండా అంతర్జాతీయ సమస్యలైన ప్లాస్టిక్, సముద్ర కాలుష్యం, పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక సంక్షోభం తదితర అనేక అంశాలపై అవగాహన పెంపొందించుకొంటారని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేంద్ర, చిట్టిబాబు, మల్లికార్జున, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు

పొదలకూరు : పట్టణంలో సిమెంటురోడ్డు నిర్మాణానికి ఆర్‌అండ్‌బీ అధికారులు గురువారం కొలతలు తీసుకున్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో సిమెంటురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్డు ప్రస్తుతం బాగా దెబ్బతింది. దీంతో వర్షాకాలంలో రోడ్డుపై నీరు నిల్వచేరి పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలో 650 మీటర్ల(బస్టాండ్ నుంచి గేటుసెంటర్ వరకు) రోడ్డు నిర్మించేందుకు మంత్రి నిధులు మంజూరు చేయించారు. పట్టణంతో పాటు రాపూరు మార్గం డేగపూడి వద్ద నిర్మించిన తారురోడ్డుతో కలిపి ఒక ప్యాకేజీగా మొత్తం రూ.5.75 కోట్లు నిధులు మంజూరు చేశారు. త్వరలోనే రోడ్డు పనులను ప్రారంభించేందుకు సంబంధిత కాంట్రాక్టర్ కూడా అధికారుల వెంట హాజరయ్యారు. పట్టణంలో వ్యాపారులకు ఇబ్బంది లేకుండా స్వల్పంగా రోడ్డుపైడు దుకాణాలను సర్ది నిర్మాణం చేపట్టేందుకు ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ సెక్రటరీ అల్లాభక్షు అధికారుల వెంట ఉన్నారు. వీలైనంత త్వరగా రోడ్డుపనులను ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ పేర్కొన్నారు.


రోడ్డు పక్కన దుకాణాలను పరిశీలిస్తున్న అధికారులు

ఉపాధ్యాయినికి సన్మానం



కోవూరు(విడవలూరు) : మండలంలోని వావిళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయిని తాళ్లపాక రజని గురువారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం వై.చెంచురామయ్య, సబ్బంది తదితరులు ఆమెను సన్మానించారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి


మాట్లాడుతున్న హరినారాయణన్


హాజరైన అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పౌష్టికాహార లోపంతో ఎదుగుదలలేకుండా ఉన్న నాలుగు వేల మంది పేద చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. పిల్లల పౌష్టికాహార లోపంపై తన చాంబర్‌లో డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్, ఐసీడీఎస్ పీడీతో గురువారం నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. పీడియాట్రిషియన్లతో వైద్యసేవలను అందించేలా డీఎంహెచ్‌ఓ బాధ్యత వహించాలని సూచించారు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో పది మంది పీడియాట్రిషియన్లు అందుబాటులో ఉన్నారని, ఒక్కొక్కరు రోజుకు కనీసం 10 మందిని చూస్తే పేద చిన్నారులు ఆరోగ్యంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేఎన్నార్ విద్యార్థికి నగదు ప్రోత్సాహకం

నెల్లూరు (టౌన్): గతేడాది నిర్వహించిన ఎన్నెమ్మెమ్మెస్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన నగరంలోని కేఎన్నార్ మున్సిపల్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి చరిణికి రూ.5,116 మొత్తాన్ని స్టేట్ ఐటీ మానిటరింగ్ ఆఫీసర్ రమేష్ గురువారం అందజేశారు. అనంతరం విద్యార్థి చరిణి, ప్రధానోపాధ్యాయుడు విజయ్‌ప్రకాష్‌ను సత్కరించారు. డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ కేవీఆర్ మూర్తి, సమగ్రశిక్ష ఏపీఓ అద్దంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

